ప్రజాశక్తి

మంగళవారం 29 అక్టోబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, వేదికపై మంత్రి నాదెండ్ల జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ తదితరులు

అసంపూర్తి చర్చలతో సాదాసీదాగా డిఆర్‌సి

పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గైర్హాజరు - సమస్యలపై ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, నరేంద్రకుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా నిర్వహించిన డిఆర్‌సి సమావేశంలో పలు అంశాలపై సాదాసీదాగా చర్చ జరిగింది. సమావేశానికి ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షత వహించారు. ఏ అంశంపైనా పూర్తిస్థాయిలో చర్చ జరగలేదు. ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుపై స్పష్టత రాలేదు. ఆగస్టు 31న కురిసిన అధిక వర్షాల వల్ల నీట మునిగిన పంటలకు ఇప్పటికే పరిహారం పంపిణీ పూర్తయిందని ఇక పరిహారం వచ్చే అవకాశం లేదని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఎమ్మెల్సీలు కెఎస్.లక్ష్మణరావు, పంచుమర్తి అనురాధా, ఎమ్మెల్యేలు దూళిపాళ్ల

▶ 2లో

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

డిఆర్‌సి సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్

- 3 లో



బెదిరింపులు, కేసులకు భయపడకుండా కొనసాగుతున్న ఆందోళనలు

ఎసిసి ఫ్యాక్టరీ స్థలాల్లో పాకలు వేసిన కార్మిక కుటుంబాలు

వార్త మెయిన్‌లో

రెండు వారాల్లో పరిష్కరించకుంటే ఎప్పుడైనా సమ్మె

- 4,5 లో

మున్సిపల్ కార్మికుల ధర్నాలో నాయకుల హెచ్చరిక

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులపై కేసులు అన్యాయం

ఖండించిన సిపిఎం జిల్లా కమిటీ

ప్రజాశక్తి-గుంటూరు

తాడేపల్లి మండలం కృష్ణనగర్‌లోని ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించారని సిపిఎం ఖండించింది. కేసులు వెంటనే ఎత్తివేయకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు పూనుకుంటామని నాయకులు హెచ్చరించారు. సోమవారం బ్రాడీపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు మాట్లాడుతూ 1993లో సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమంగా లాకౌంట్‌కు గురై 333 మంది

▶ 2లో

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులపై కేసులు అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

కార్మికులు రోడ్డున పడ్డారని, వారికి ఎలాంటి నష్టపరిహారమూ ఇవ్వకుండా లాకౌంట్ చేయడం చట్ట విరుద్ధమని అన్నారు. కార్మికులకు రూ.43 కోట్ల పరిహారం ఇవ్వాల్సివుండగా సుమారు రూ.2 వేల కోట్ల విలువైన ఫ్యాక్టరీ భూమిని ప్రైవేటు వ్యక్తులకు అక్రమంగా రూ.10 కోట్లకు ధారదత్తం చేశారని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలని 2015లోనే హైకోర్టు, లేబర్ కోర్టు తీర్పుచెప్పినా, తీర్పును అమలు జరపలేదన్నారు. సమస్యను పరిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే లోకేష్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. విలువైన ఫ్యాక్టరీ భూములను అవసరమైతే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని, అక్రమంగా కొన్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, కె.నళినీకాంత్, ఎం.రవి, ఎన్.భావన్నారాయణ, ఎస్ఎస్.చెంగయ్య పాల్గొన్నారు.

లక్ష్యంలో మిగిలింది 65 రోజులే : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

100 రోజుల ప్రణాళిక కాలంలో మరో 65 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున లక్ష్యాల పురోగతిని వేగవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. నరసరావుపేటలోని పల్నాడు కలెక్టరేట్‌లోని వంద రోజుల ప్రణాళిక లక్ష్య సాధనపై సర్వశాఖల సమన్వయ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. గృహ నిర్మాణం, అంగన్వాడీ భవనాలు, సంక్షేమ హాస్టళ్ల నిర్మాణాలకు ఇసుక కేటాయింపుల్లో ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రభుత్వ నిర్మాణాలకోసం ప్రత్యేకంగా ఒక రీచును రిజర్వ్ చేయాలన్నారు. పీఎం గ్రామ స్వరాజ్య యోజన ద్వారా ఇప్పటివరకూ రోడ్డు లేని నివాసాలకు నూతన రోడ్ల నిర్మాణాలకు అనుమతులు పొందాలన్నారు. అంగన్ వాడీ సెంటర్లలోలో పోషణ వాటిక, హార్వెస్టింగ్ నిర్మాణాలు, టాయిలెట్లు నిర్మాణాలు వచ్చేనెల 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ ద్వారా 3,58,824 పని దినాలు ఉపాధి కల్పించి ఇళ్ల నిర్మాణాలకు వేగవంతం చేయాలన్నారు.

తాగునీటి ట్యాంకర్ల క్లోరినేషన్ రెండ్రోజుల్లో పూర్తవ్వాలని మండల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొన్ని రోజులుగా అక్కడ అక్కడా డయేరియా కేసులు నమోదవుతున్నాయని గుర్తు చేశారు. రోడ్ల వెంట చెత్తకుప్పలు ఇంకా కనిపిస్తున్నాయని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. క్లాప్ మిత్రలకు జీతాలు సకాలంలో చెల్లించాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన శావల్యాపురం, దుర్గి, రాజుపాలెం, పిడుగురాళ్ల అధికారులకు షోకాజుల జారీకి ఆదేశించారు.

రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో పని చేసి జిల్లా ప్రజలు ప్రమాద రహిత దీపావళి వేడుకలు నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చెప్పారు. నివాస ప్రాంతాలకు దూరంగా, బహిరంగ ప్రదేశాల్లో తాత్కాలిక టపాసుల షాపులకు అనుమతులు ఇవ్వాలన్నారు. ప్రతి 2 షాపుల మధ్య దూరం కనీసం 10 అడుగులు ఉండేలా చూడాలన్నారు. పర్మినెంట్ హోల్ సేల్ షాపులు, తాత్కాలిక షాపుల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనల ప్రకారం మంటలు ఆర్పేందుకు డ్రై కెమికల్, నీళ్లు అందుబాటులో ఉంచాలన్నారు. అనుమతులు లేని షాపులను సీజ్ చేయాలన్నారు.

35 మంది 'తిరుమల' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ గ్రామ పరిధిలోని తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన జస్ట్ డయల్ కంపెనీ ఈనెల 26 నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 35 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ సోమవారం తెలిపారు. వీరికి శిక్షణ కాలంలో వార్షిక వేతనం రూ.2.86 లక్షలు ఉంటుందన్నారు. ఎంపికైన వారిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ అభినందించారు.



కలెక్టరేట్ వద్ద వివోఏల ధర్నా - అధికారుల హామీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ వేధింపులలో భాగంగా తొలగించిన విఓఏలను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు విఓఏలతో కలిసి సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో పల్నాడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా వ్యాప్తంగా 600 మందికి పైగా వివోఏలను నిర్ధాక్షిణ్యంగా తొలగించారని, వీరిలో 100 మందికి పైగా కోర్టును ఆశ్రయించగా కోర్టు బాధితులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా ఎపిఎంలు పట్టించుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో



విఓఏలను డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్ కలిసి సిఐటియు నాయకులతో మాట్లాడారు. కోర్టు ఉత్తర్వులు, విఓఏల వినతులు పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.శ్రీను, వివోఏలు పాల్గొన్నారు.

4న కలెక్టరేట్ వద్ద విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి-సత్తెనపల్లి

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్ఎ) సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల 4న నరసరావుపేట కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని విఆర్ఎల సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్.బందగీ సాహెబ్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో బందగీ సాహెబ్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా జీతాలు పెరగక అవస్థలు పడుతున్న విఆర్ఎలకు తెలంగాణలో మాదిరి పే స్కేలు అమలు చేయాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న వీఆర్వో, నైట్ వాచ్మెన్, అటెండర్, రికార్డు అసిస్టెంట్ తదితర ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించకపోగా సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా రోజు రోజుకూ అదనపు పని భారం మోపుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. బలవంతంగా నైట్ వాచ్మెన్ విధులతో పాటు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు



అదనపు విధులు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. వీఆర్ఏల భద్రత గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో చేపట్టే ధర్నాలో విఆర్ఎలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంజీవరావు, సుబ్బారావు, రవి, సుందర్‌రావు, దినేష్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

అసంపూర్తి చర్చలతో సాదాసీదాగా డిఆర్‌సి

(మొదటి పేజీ తరువాయి)

నరేంద్ర, బి.రామాంజనేయులు, నశీర్‌అహ్మద్ పలు సమస్యలను ప్రస్తావించారు. ఎమ్మెల్యేలు గల్లా మాధవి, తెనాలి శ్రావణ్‌కుమార్, పలువురు ఎమ్మెల్సీలు సమావేశానికి రాలేదు. మంత్రి నారా లోకేష్ విదేశీ పర్యటనలో ఉండటంతో ఆయన కూడా సమావేశానికి రాలేకపోయారని ఆయన తరుపున తాను మంగళగిరి సమస్యలను ప్రస్తావిస్తున్నట్టు ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధా తెలిపారు. మంగళగిరిలో ఇరిగేషన్, అటవీ, రైల్వే భూములలో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్నవారికి స్థలాలు రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉండే వారికి రెగ్యులరైజేషన్ చేసే చట్టం కాలపరిమితి ఇటీవల ముగిసిందని, ప్రభుత్వం మళ్లీ చట్టం చేయాలని కలెక్టర్ బదులిచ్చారు. ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్ల పథకం, స్వర్ణాంధ్ర 2047 జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్, వ్యవసాయం, ఉద్యానం, ఇరిగేషన్, మార్కెటింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. ఏడాది మూడు ఉచిత సిలిండర్ల పథకంపై జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వండి : కెఎస్ లక్ష్మణరావు

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ రావు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళికలో వ్యవసాయానికి, పరిశ్రమలు, స్కిల్ అభివద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై పూర్తి సమాచారం అందించాలన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. వృద్ధి రేటు పెరగాలంటే రైతులకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. గుంటూరు ఛానల్ అభివృద్ధికి వెంటనే నిధులు కేటాయించాలని కోరారు. నగరంలో గోరంట్ల వాటర్ స్కీంను, నార్ల వెంకటేశ్వర ఆడిటోరియం, అంబేధ్కర్ భవన్ పెండింగ్ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలన్నారు. కౌలు రైతులకే బ్యాంకర్లు పంట రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 46 వేల మందికి సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాల్సి ఉండగా కేవలం 38,901 మందికి ఇచ్చారని వీరిలో 5144 మంది రైతులకు రూ.42.46 కోట్లుమాత్రమే రుణాలు ఇచ్చారని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకులపై వత్తిడి తెచ్చి కౌలు రైతులకు రుణాలు ఇప్పించాలన్నారు. కౌలు రైతు చట్టం మార్చాలన్నారు. శుభం కోల్డ్ స్టోరేజీ లో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పసుపు రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని, కనీస మద్ధతు ధర రూ.7521 ఉండగా క్వింటాళ్ కేవలం రూ.5 వేల లోపు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. గుంటూరులో ఐదు చోట్ల కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించినట్టు జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ తెలిపారు.

ఉచిత గ్యాస్‌పై అవగాహన కల్పించండి : నరేంద్ర

పొన్నూరు ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్ల అర్హతలపై, బుకింగ్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఫిర్యాదుల పరిష్కారినికి జిల్లాలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాకు కీలకమైన టెక్స్ టైల్స్ పరిశ్రమలకు ప్రాధాన్యత ఇచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక ఇబ్బందులు ఉన్న గ్రామాల్లో శంకుస్థాపన చేసిన పనులకు ఇసుక అందించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. జల్ జీవన్ మిషన్ పనులు తిరిగి ప్రారంభించాలన్నారు.

డ్రెయిన్లను అభివృద్ధి చేయాలి : రామాంజనేయులు

ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ పంట పొలాలు ముంచెత్తే మురుగునీరు నిర్వహణకు నల్లమడ, నల్ల డ్రెయిన్ అధునీకరణ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని స్టార్టప్ కంపెనీల ఉత్పత్తులను ప్రభుత్వం ప్రోక్యూర్ చేసేలే టెండరు నిబంధనలు సవరించితేనే మేకిన్ ఆంధ్రప్రదేశ్ సాధ్యం అవుతుందన్నారు. నూతనంగా అగ్నిమాపక శాఖ తీసుకువచ్చిన నిబంధనల ప్రకారం కోల్డ్ స్టోరేజీలకు ఎన్ఓసీలు లేక ఇన్స్ రెన్స్ క్లైయిమ్స్ రెన్యూవల్ కావటం లేదని, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆటోనగర్‌కు తాగునీరు ఇవ్వండి : నశీర్

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఆటోనగర్‌లో పూర్తిగా మౌలిక సౌకర్యాలు కల్పిస్తే అక్కడ నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేసి యువతకు పూర్తి స్థాయిలో శిక్షణ అందించవచ్చాన్నారు. మానస సరోవరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. నగరంలో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు.

సమిష్టి ప్రణాళికతో అభివృద్ధి : మంత్రి మనోహర్

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమిష్టిగా ప్రణాళిక ప్రకారం అమలు చేయాలన్నారు. జిల్లాలో రాజధాని ప్రాంతం ఉండటంతో మౌలిక సౌకర్యాలు, లాజిస్టిక్ హబ్ ఏర్పాటుకు ఫోకస్‌గా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వర్ణాంధ్ర 2047 సాధనకు జిల్లాకు అవసరమైన ప్రాజెక్టులు, నిధులు మంజూరు అయ్యేలా మంత్రులు, ప్రజాప్రతినిధులం కృషి చేస్తామన్నారు. నిత్యావసర సరుకులను బహిరంగ మార్కెట్ ధరలు కంటే సగానికి పైగా రాయితీతో ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం, కందిపప్పు, వంట నూనెలు అందించటంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగేలా ప్రచారం చేయాలన్నారు. నగరంలోని బీఆర్ స్టేడియం, పీవీకే నాయుడు, మనస సరోవరం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతుల కోసం సాగుదారునికే పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలో అన్ని శాఖలపై క్షుణ్ణంగా సమీక్షించేందుకు వీలుగా ప్రతి డీఆర్సీ సమావేశంలో రెండు అంశాలపైనే సమీక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉచిత ఇసుక విధానం నూరు శాతం పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. రహదారులపై ఉన్న గుంతలను నవంబరు నాటికి పూడ్చివేసే కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకానికి సంబంధించి అవగాహన, ఫిర్యాదుల కోసం జిల్లాలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామన్నారు. శుభం కోల్డ్ స్టోరేజీ లో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పసుపు రైతులకు పరిహారం అందించేందుకు క్వింటాళ్‌కు ప్రభుత్వం రూ.7 వేలు అందించాలని ప్రకటించిందని, ఇన్సురెన్స్ క్లైయిమ్ ప్రధాన కార్యాలయంలో అమోదం పొందే ప్రక్రియ పూర్తయిన వెంటనే రైతులకు నగదు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, నగర కమిషనర్ పి.శ్రీనివాసులు, జిలా రెవెన్యూ అధికారి పి.రోజా పాల్గొన్నారు.

మద్యం తాగి స్నేహితుని హత్య

ప్రజాశక్తి - దుర్గి : మండల పరిధిలోని అడిగొప్పల గ్రామానికి చెందిన షేక్ సైదా (28) సోమవారం సాయంత్రం అడిగొప్పల గుట్టమీద సెంటర్ సమీపంలో ఓ బేకరీ వద్ద హత్య గురయ్యాడు. కారంపూడి సిఐ శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. మృతుడుషేక్ సైదా, నబిష, ఒప్పిచర్ల జానీబాష ముగ్గురు సెంటర్ సమీపంలో మద్యం సేవిస్తుండగా మాట మాట పెరిగి వివాదం వచ్చింది. దీంతో పెరుగు శివకృష్ణ వద్దకు జానీబాష వెళ్లి ఫోన్ చేయించాడు చేయించాడు. అనంతరం వారిద్దరూ బైక్ మీద అక్కడికొచ్చారు. పెరుగు శివకృష్ణ తన వద్ద మేకలకు ముళ్ళు తీసే కత్తితో సైదా చాతిపై పొడిచి ఇద్దరూ పారిపోయారు. కొన ఊపిరితో ఉన్న సైదాను స్థానికులు గమనించి దుర్గి వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలిని కారంపూడి సిఐ శ్రీనివాసరావు, దుర్గి ఎస్సై సుధీర్ కుమార్ పరిశీలించి కేసు నమోదు చేశారు. జానీ బాష, శివకృష్ణ హైదరాబాదులో సాఫ్ట్వేర్‌గా పనిచేస్తున్న షేక్ హుస్సేన్ ముగ్గురు మంచి స్నేహితులు. గతంలో జానీబాష భార్యకు హుస్సేన్ మెసేజ్ పెట్టడంతో గ్రామస్తులు క్షమాపణ చెప్పించారని, తాజా ఘటనకు ఇదే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఇద్దరు ఉద్యోగుల సస్పెండ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహించిన అచ్చంపేట విస్తరణ అధికారి కె.వీర్రాజు, బొల్లాపల్లి మండలం విస్తరణ అధికారి జానీబాషను విధుల నుండి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.



నిరసన తెలియచేస్తున్న కార్మికులు, మహిళలు, నాయకులు

సహన కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు: మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులపై జరుగుతున్న దాడులను ఖండించాలని, తెనాలిలో రౌడీషీటర్ నవీన్ దాడిలో మృతి చెందిన సహానా కుటుంబానికి న్యాయం చేయాలని, నవీన్‌ని వెంటనే శిక్షించాలని కోరుతూ స్థానిక వెంకటాద్రిపేట నుండి సంజీవయ్య నగర్ రైల్వే గేటు వరకు ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నగర తూర్పు కమిటీ అధ్యక్షులు టి.రాధా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలం అయ్యాయని అన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం షాపులు తెరవటం, తక్కువ ధరకే మద్యం దొరకటం వలన యువత శక్తి నిర్వీర్యం అయిపోతుందని అన్నారు. మద్యం, డ్రగ్స్ నియంత్రణ లేకపోవడం వలన మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఎక్కువవుతున్నాయని అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెనాలి ఘటనపై ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. సహాన కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి కె. శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పి.దీవెనరావు, అంగన్వాడి నాయకులు నాగేశ్వరి, ఓ.రోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

డిఆర్‌సి సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



రాష్ట్రంలో కీలకమైన గుంటూరు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సోమవారం సాయంత్రం జరిగిన గుంటూరు కలెక్టరేట్‌లో డిఆర్‌సి సమావేశంకు మంత్రి దుర్గేష్ అధ్యక్షత వహించారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించామని, స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకొని మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారు లతో కలిసి, వారి సూచనలు పరిగణలోకి తీసుకొని జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. సమావేశంలో ఏయే అంశాలపై దృష్టి సారించాలన్న అంశంపై చర్చించామన్నారు. ప్రధానంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ పత్రం తయారీపై సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో త్వరతగతిన సాధించాల్సిన అంశాలను స్వర్ణాంధ్ర 2047 విజన్ లో పొందుపరచాలని మంత్రి దుర్గేష్ అధికారులకు సూచించారు. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు జిల్లాను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, ధాన్యం కొనుగోలు, దీపావళి కానుకగా దీపం-2 పథకం అమలు విధానం, హార్టికల్చర్, జలవనరులు, పర్యాటక రంగం తదితర రంగాలపై చర్చించి సమస్యలు తెలుసుకున్నామన్నారు. త్వరలోనే సంబంధిత సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గుంటూరు చానల్, కాలువల ఆధునికీకరణ పూర్తి చేస్తామన్నారు.ఆటోనగర్‌లో మౌలిక వసతుల కల్పన, మానస సరోవరం పర్యాటక ప్రాంతం తదితరుల అంశాలు దృష్టికి వచ్చాయని, ప్రతిపాదనలు తెప్పించుకొని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు దూళిపాళ్ళ నరేంద్ర, బూర్ల రామాంజనేయులు, నసీర్, ఎమ్మెల్సీలు కే. లక్ష్మణ్ రావు, పంచుమర్తి అనురాధ, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ భార్గవ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ

ప్రజాశక్తి - విజయవాడ : మానవ హక్కుల ఉద్యమ నేత, ప్రఖ్యాత స్కాలర్ ప్రొఫెసర్ జి.ఎన్.సాయి బాబా సంస్మరణ సభ మంగళవారం సాయంత్రం 6 గంటలకు విజయ వాడ ఎంజి రోడ్ రాఘవయ్య పార్క్ సమీపంలోని బాలోత్సవ భవన్లో జరుగుతుంది. ఐలు, ఐఎల్, ఎపిసి ఎల్ఎ, ప్రొగ్రెసివ్ ఫోరం ఆధ్వర్యాన జరిగే ఈ సభలో బార్ కౌన్సిల్ సభ్యులు, హైకోర్టు సీనియర్ న్యాయ వాదులు, విజయ వాడ, గుంటూరు న్యాయవాదులు పాల్గొంటారు.



గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

యువజనోత్సవాల్లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు : ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ అంతర్ కళాశాలల యువజనోత్సవాలలో చేబ్రోలు ఫార్మసీ కాలేజి విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర అన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను సోమవారం కళాశాలలో అభినందించారు. ఫోటోగ్రఫీలో టి.భానుయశస్వి ప్రథమ బహుమతి, ఇన్‌స్టాలేషన్‌లో డి.సాయి రాం బృందం, మూడో బహుమతి, క్లే మౌల్డింగ్‌లో బి.స్వామి ద్వితీయ బహుమతితోపాటు, స్పాట్ పెయింటింగ్‌లో కన్సోలేషన్ బహుమతి పొందినట్లు తెలిపారు. చదువుతుపాటు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు రాణించాలని ప్రిన్సిపాల్ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, స్పోర్ట్స్ , సాంస్కృతిక విభాగాధిపతి డాక్టర్ జె.సుబ్బారావు పాల్గొన్నారు.

హరిత టపాసులు వినియోగించాలి

జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ

ప్రజాశక్తి-గుంటూరు

దీపావళిపై ప్రజలకు అవగాహన కోసం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రూపొందిన 'కాలుష్యం లేని దీపావళి - ఆనందమైన దీపావళి' , 'టపాసులను ఒదిలేద్దాం- దీపాలను వెలిగిద్దాం' నినాదాలతోఉన్న పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దీపావళి సందర్భంగా ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు మామూలు టపాసులు వాడొద్దని, హరిత టపాసులు వాడాలని కోరారు. సాధారణ టపాసులతో పోల్చితే హరిత టపాసులు తక్కువ మోతాదులో బూడిద, కాలుష్య కారక వాయువులు , శబ్దం , పొగ విడుదల చేస్తాయన్నారు. కార్యక్రమంలో జేసీ ఏ.భార్గవ్‌తేజ , డిఆర్ఓ పెద్ది రోజా , డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి , గంగరాజు , గుంటూరు ఆర్డిఓ కే.శ్రీనివాస రావు, ఏ.పి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మహ మ్మద్ నజీనా బేగం, నోడల్ అధికారి తిరుపతి రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విధులు చేపట్టిన నూతన డిఇఒ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పల్నాడు జిల్లా పాఠశాల విద్యాధికారిగా ఎల్. చంద్రకళ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈమె గతంలో విశాఖ జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేస్తుండగా బోయపాలెం ప్రభుత్వ డైట్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసి డిఇఒగా అదనపు బాధ్యతలు అప్పగించారు. నూతన డిఇఒకు సిబ్బంది శు భాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న ఏపూరి గోపాలరావు

నదుల అనుసంధానంలో భూములు కోల్పోయే రైతులకు పరిహారం ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - నకరికల్లు

సిపిఎం మండల మహాసభను చేజర్లలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జి.పిచ్చారావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పిచ్చారావు మాట్లాడుతూ మండలంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడతామని, చేజర్లలో బేతంరాజు చెరువు లిఫ్ట్ ఇరిగేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని, ముస్లిమ్ కాలనీలో సైడు కాల్వలు నిర్మించాలని, కృష్ణా -పెన్నా నదుల అనుసంధానంలో భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు ఈ మేరకు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వర్‌రెడ్డి, ఏపూరి గోపాలరావు, నాయకులు టి.పెద్దిరాజు, ఇ.లక్ష్మారెడ్డి, అప్పిరెడ్డి, రామాంజి నాయక్, చట్టు కోటేశ్వరావు, ఎ.వెంకటేశ్వర్లు, దుర్గాబాయి పాల్గొన్నారు.



బ్యాంకు మేనేజర్‌కు రైతుసంఘం వినతి

ప్రజాశక్తి - పెదకూరపాడు

కౌలు రైతులకు పంట రుణాలివ్వాలని రైతు సంఘం ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్‌కు సోమవారం విన్నవించారు. రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.శేషారావు మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం పత్తి, ఇతర పంటలకు ఎకరానికి రూ.50 వేలు, మిరప, పసుపు రైతులకు ఎకరానికి రూ.లక్ష రుణాలను హామీలేమీ లేకుండా ఇవ్వాలని కోరారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతుకు పంట రుణం ఇవ్వాలన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర బ్యాంకర్ల సమావేశంలోనూ ఇందుకు అంగీకరించారని గుర్తు చేశారు. నిబంధన మేరకు రుణాలిస్తామని మేనేజర్ హామీ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి ఎ.శాంతి, సిబ్బంది ధనలక్ష్మి, సాయి, సురేష్, జ్యోతి, రైతుసంఘం నాయకులు ఎం.మస్తాన్ రావు, జానీబాషా, దాసు పాల్గొన్నారు.

రెండు వారాల్లో పరిష్కరించకుంటే ఎప్పుడైనా సమ్మె

- మున్సిపల్ కార్మికుల ధర్నాలో నాయకుల హెచ్చరిక
- పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికులను పెంచాలని, జీతం బకాయిలు, రక్షణ పరికరాల కోసం కమిషనర్లకు వినతులు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ అన్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. సిలార్ మసూద్ మాట్లాడుతూ కోవిడ్ కార్మికులు, బదిలీ కార్మికులు, ఎన్.ఎం.ఆర్, క్లాప్ డ్రైవర్లకు చట్టబద్ధమైన సౌకర్యాలు, సెలవులు, రక్షణ పరికరాలు, వాహనాల మరమ్మతులు, పనిముట్లు యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు, టవల్స్ ఇవ్వడంలో జాప్యం తగదన్నారు. పట్టణాల విస్తరణ మేరకు కార్మికుల సంఖ్యను పెంచాలని,వారాంతపు, క్యాజువల్, జాతీయసెలవులు పక్కాగా అమలుచేయాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలులో ఉన్న లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో బకాయిలు చెల్లించాలని, ఆప్కాస్ ద్వారా రిటైర్మెంట్ చేసిన కార్మికుల పిల్లలకు ఉపాధి కల్పించాలని, ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ ఎంఎస్ నెం.11 ప్రకారం స్కిల్డ్, సెమీస్కిల్డ్ ఆధారంగా జీతాలు చెల్లించాలని కోరారు. పర్మినెంట్ సిబ్బందికి సరెండర్ లీవులు, డిఎ బకాయిలు, జీపిఎఫ్ అకౌంట్లు తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత సకాలంలో వేతనాల చెల్లింపు, ప్రమాద మతులకు ఎక్స్‌గ్రేషియో రూ.7 లక్షలకు పెంపు, అంత్యక్రియలకు రూ 20 వేలు, ఇంజనీరింగ్ కార్మికుల జీతాల నిర్ణయం మొదలైన వాటికి వెంటనే జి.ఓ.లు జారీ చేయాలని కోరార. మహిళా కార్మికులపై లైంగిక దాడులు, వేధింపులను నివారించాలని సుప్రీంకోర్టు సూచనల మేరకు కంప్లైంట్ కమిటీలను ఏర్పాటు చేసి కమిటీలలో మహిళా కార్మికులను సభ్యులుగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావుకు ఇచ్చారు. సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించకపోతే సమ్మెకూ వెనకాడబోమన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు పట్టణ సహాయ కార్యదర్శి జె.రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం కార్మికులు ధర్నాలో జిల్లా నాయకులు చంద్రకళ మాట్లాడుతూ పిఎఫ్ పెద్ద సమస్యగా ఉందని, దాన్ని



పరిష్కరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీకు వినతిపత్రం ఇచ్చారు. బి.రాజశేఖర్, ప్రభుకుమార్, జె.రమేష్, సిహెచ్.సునీత పాల్గొన్నారు.



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మున్సిపల్ కార్మికుల స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పిడుగురాళ్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు సోమవారం ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణంలో పట్టణీకరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య లేకపోవడం వలన కార్మికులపై పని భారం పడుతోందని, కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. చనిపోయిన కార్మికులకు రావాల్సిన పరిహారం వెంటనే చెల్లించాలన్నారు. పనిముట్లు, పుష్‌కాట్లు, ట్రాక్టర్లు రిపేర్ చేయించాలని, చీపుర్లు ఇవ్వాలని, పలుగులు, పారలు పదును పెట్టించాలని, సబ్బులు, చెప్పులు, నూనెలు యూనిఫా వెంటనే ఇవ్వాలని కోరారు. విజయవాడ వరదల సందర్భంగా పనిచేసిన కార్మికులకు ఒక జత బట్టలు, ఒక నెల వేతనం అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాదిలో పెండింగ్ లో ఉన్న రెండు నెలలు హెల్త్ అలవెన్స్ వెంటనే విడుదల చేయాలని, ఎన్ఎంఆర్‌లకు నాలుగు నెలలు, టిఎల్ఎఫ్ కార్మికులకు మూడు నెలలు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్మికులు బి.రామారావు, కె.కొండలు, ఎ.రామారావు, సుజాత, బి.పార్వతి, డి.లక్ష్మి, లక్ష్మి, బి.అనిల్, ఎం.ప్రతాప్, జి.నాగేశ్వరరావు, డి.మార్తమ్మ, కె.గురవయ్య, సిహెచ్.లక్ష్మి, ఎం.శ్రీను పాల్గొన్నారు.



ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పురపాలక సంఘ పరిధిలో కోవిడ్ సమయంలో పనిచేసేందుకు కొంత మంది పారిశుధ్య కార్మికులను పనుల్లోకి తీసుకున్నారని, వారిని కొనసాగించాలని సిఐటియు డివిజన్ అధ్యక్షులు బండ్ల మహేష్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనలో మహేష్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి పని చేశారని, వీరికి ఇచ్చే వేతనాలు కూడా చాల తక్కువని గుర్తు చేశారు. వారికి ఇతర బెనిఫిట్స్ కూడ ఏమి లేవన్నారు. పైగా 10 నెలలుగా వేతనాలు కూడా చెల్లించలేదన్నారు. కోవిడ్ సమయంలో పని చేసిన వారిలో 25 మంది మాత్రమే మిగిలినారని, వారిని వెంటనే పనుల్లోకి తీసుకోవడంతోపాటు వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిషనర్ డి.వేణుబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు కె.రమణ, ఇస్సాక్, హనుమయ్య, బూలక్ష్మి, ఏసురత్నం, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, జ్యోతిష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తికి సత్కారం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : గుంటూరు కోర్టులో మూడవ అదనపు జిల్లా జడ్జీగా ప్రమోషన్ పొందిన న్యాయమూర్తి సిహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావును సత్తెనపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం సత్కరించారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.అనిల్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు జి.మార్క్, డి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.రవి, ఈ.సి మెంబెర్స్ టి.విజయ భరత్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గుంటూరు నగరపాలక సంస్థ వద్ద ధర్నాలో పాల్గొన్న ఉమామహేశ్వరరావు, కార్మికులు, నాయకులు



మంగళగిరి ఎంటిఎంసి కార్యాలయం వద్ద ధర్నాలో కార్మికులు, నాయకులు

సమ్మె కాలం జీతం చెల్లించాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ కార్మికుల సమ్మె ముగిసి 9 నెలలు గడిచినా ఇంతవరకు ప్రభుత్వ హామీ ఇచ్చిన విధంగా సమ్మెకాలం జీతం చెల్లించకపోవటం అన్యాయమని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. పండగ కానుక రూ.1000లు వెంటనే చెల్లించాలని సమ్మె ఒప్పందాల జీఓలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సమ్మె ముగిసి 9 నెలలు అయ్యిందని, కానీ సమ్మెకాలం జీతం, పండగ కానుక 1000 రూపాయలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు చెల్లిస్తే గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వారు ఎందుకు చెల్లించరని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంపుదలకు నియమించిన 9 మంది అధికారుల కమిటీ నివేదిక ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సెమీస్కిల్డ్, స్కిల్డ్ జీతాలు చెల్లించాల్సిన కార్మికులకు కూడా అన్‌స్కిల్డ్ జీతాలు చెల్లిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. శాశ్వత స్వభావం కలిగిన పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులను చట్ట ప్రకారం పర్మినెంట్ చేయాలన్నారు. గత సమ్మెకాలం ఒప్పందాలకు జిఓలు జారీచేయాలని మున్సిపల్ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, డి.యం.ఏలను అనేక సార్లు కలిసి వినతిపత్రాలు ఇచ్చామని, పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి పూనుకోకపోతే కలిసివచ్చే సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్' చేపట్టిన జిఎంసి కార్మికులు పనులు చేయటానికి అవసరం అయిన చీపుర్లు, కాలవ పారలు ఇవ్వకుండా ఎలా పని చేస్తారని ప్రశ్నించారు. పుష్‌కార్టులు, చెత్త తరలించే వాహనాలు రిపేర్లు సకాలంలో చేయించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు టూల్‌కిట్స్, రక్షణ పరికరాలు, సెక్యూరిటీగార్డులకు యూనిఫారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, శానిటేషన్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సోమి శంకరరావు, నాయకులు కుంభా శివయ్య, షేక్ బాషా, కంచర్ల సురేష్‌బాబు, కాళంగి భాగ్యరాజు, పచ్చల సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, పట్టణ అధ్యక్షులు వై కమలాకర్, తాడేపల్లి మండలం సిఐటియు నాయకులు డి వెంకటరెడ్డి, రాజధాని కమిటీ డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజ్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న వివిధ రంగాల కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. క్లాప్ ఆటో డ్రైవర్స్ గత మూడు మాసాల నుండి కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గత వారం రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్ సమస్యను పరిష్కరించడం లేదని విమర్శించారు. ఇంజనీరింగ్ కార్మికులు ఇంకా కాంట్రాక్టు కార్మికులుగానే కొనసాగుతున్నారని వారిని ఆప్కాస్ లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం శ్రీను, మంగయ్య, శివ, సాయిపాల్గొన్నారు. అనంతరం అడిషనల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.

నేడు సిపిఎం నాయకులు సోలా ముత్యాలరావు సంస్మరణ సభ

ప్రజాశక్తి-తాడేపల్లి



సిపిఎం తాడేపల్లి పట్టణ నాయకులు సోలా ముత్యాల రావు సమస్మరణ సభ మంగళవారం ఉదయం 11 గంటలకు నెహ్రూ బొమ్మ సెంటర్లో జరుగుతుందని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావుతో పాటు స్థానిక నాయకులు పాల్గొంటారని తెలిపారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు అన్ని చర్యలూ తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన పట్టభద్రులను ఓటరుగా నమోదు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుపై కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, జేసీ ఏ.భార్గవ్ తేజ, డిఆర్ఓ పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు , ఆర్డీఓ శ్రీనివాసరావుతో కలసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదుకు నవంబరు 6వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించటం జరుగుతుందన్నారు. పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు ఓటరుగా నమోదు కావటానికి 2024 నవంబర్ 1 నాటికి మూడు సంవత్సరాలు (అనగా 1-11-2021 నాటికి) గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులవుతారన్నారు. సాధారణ డిగ్రీతోపాటు, పదవ తరగతి తరువాత మూడేళ్లపాటు డిప్లొమో చేసిన వారు ఓటరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గతంలోని ఓటరు జాబితాను పరిగణలోకి తీసుకోరని, అందువలన ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోని ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు ఉందన్నారు. ఏఈఆర్‌ఓలు బిఎల్‌ఓల ద్వారా ఇంటింటి వెరిఫికేషన్ చేసి గ్రాడ్యుయేట్ లను ఓటరుగా నమోదు చేయించాలన్నారు. అలాగే జిల్లా కార్యాలయాల హెచ్‌ఓడీలు తమ కార్యాలయ గ్రాడ్యుయేట్ సిబ్బంది ఓటరుగా నమోదు చేసుకున్నారో లేదో తనిఖీ చేయాలన్నారు. కష్ణ-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి సభ్యుల ఎన్నికలకు గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకు 39 వేల దరఖాస్తులు మాత్రమే అందాయని , నవంబర్ 6లోగా నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిపిఓ శేషశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 211 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించిన అర్జీలను సకాలంలో, పునరావృతం కాకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ, డిఆర్ఒ పెద్దిరోజా, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు, ఆర్‌డిఒ కె.శ్రీనివాసరావు ప్రజల నుండి 211 అర్జీలు స్వీకరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

డ్వాక్రా నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

వట్టిచెరుకూరులో డ్వాక్రా నిధులు దుర్వినియోగానికి పాల్పడిన గోగినేని చంద్రావతిపై చర్యలు తీసుకోవాలని గాయత్రి గ్రామ సమాఖ్యకు చెందిన డ్వాక్రా మహిళలు స్పందనలో అర్జీ అందచేశారు. 2017 ఫిబ్రవరి నుండి 2024 వరకూ పనిచేసిన విఒఎ గోగినేని చంద్రావతి రూ.16 లక్షలు దుర్వినియోగం చేసిందని తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రెసిడెంట్, సెక్రెటరీల సంతకాలు ఫోర్జరీ చేసి శ్రీనిధి పొదుపు, గాయత్రి సమైఖ్య పొదుపు అకౌంట్ నుండి డబ్బులు తీసుకున్నదని తెలిపారు. ఏ గ్రూపు వారినీ ఆఫీసు వద్దకు రానివ్వకుండా ఎపియం, విఒఎ చాలా డబ్బులు దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. కూలీ పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులో పొదుపు చేసుకుంటుంటే మమ్ముల్ని మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అప్పటి ఎపిఎం రవీంద్రకుమార్, సిసి కిషోర్‌బాబు, ప్రాజెక్ట్ డైరెక్టర్లుకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. వట్టిచెరుకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ప్రస్తుత డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి మా ఫిర్యాదుపై స్పందించకపోగా, సిఐని కేసు ఫైల్ చేయకుండా అడ్డుపడుతున్నారని తెలిపారు. కావున 320 మంది డ్వాక్రా సభ్యుల బాధను అర్థం చేసుకొని, సమస్య పరిష్కరించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో కె.మాధురి, బి.వరలక్ష్మి, యం.శివకుమారి, కె.శివకుమారి తదితరులున్నారు.



నల్లమడ వరద సమస్యను పరిష్కరించాలి

నల్లమడ ప్రాంతమైన ప్రత్తిపాడు, పెదనంది పాడు, కాకుమాను, పర్చూరు, చిలకలూరిపేట, బాపట్ల మండలాల్లో తాగునీరు, సాగునీరు లేక, నల్లమడ వరద సమస్యతో ఈ ప్రాంత రైతులు వ్యవసాయంలో విపరీతమైన నష్టాలకు గురవుతున్నారని నల్లమడ రైతు సంఘం నాయకులు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. ఈ సందర్భంగా నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ ఈ విషయాలపై పలుమార్లు గతంలో ప్రభుత్వం దృష్టికి పాలకులు హామీ ఇచ్చినా పరిష్కారం కాలేదన్నారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించటానికి నిధులు కేటాయించి, భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి, కాలపరిమితితో కూడిన ప్రణాళికతో తాగునీరు, సాగునీరు అందించాలని కోరారు. నల్లమడ శాశ్వత వరద నివారణ చర్యలు తీసుకోవాలని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు.



డిఇకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు

నూతన డిఇఒ రేణుక బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమితులైన సి.వి.రేణుక సోమవారం డిఇఒ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 2008లో ఉప విద్యాశాఖ అధికారిగా విశాఖ పట్టణంలో ఆమె సర్వీసు ప్రారంభించారు. 2017లో పదోన్నతి పొంది ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీఈఓగా పనిచేశారు.జిల్లాల విభజన తర్వాత ఎన్‌టిఆర్ జిల్లా డిఇఒగా, ఆ తర్వాత 2024 మే నుండి ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ, మోనిటరింగ్ కమిషన్‌లో డిప్యూటీ డైరెక్టర్ గా పని చేస్తున్నారు. ప్రస్తుతం బదిలీపై గుంటూరు డిఇఒగా నియమితులఅయ్యారు. ఈ సందర్భంగా నూతన డిఇఒకు గుంటూరు, తెనాలి ఉప విద్యాశాఖ అధికారులు వెంకటేశ్వరరావు, శాంతకుమారి, డిఇఒ ఆఫీసు ఎ.డి-1 లావణ్య, ఎ.డి 2 నిర్మల, ఎంఇఒలు ఖుద్దూస్, సుబ్బారావు, ప్రధానోపాధ్యాయుల సంఘం తిరుమలేష్, ఉర్దూ డి.ఐ ఖాసీం పలువురు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



డాక్టర్ శ్రీకృష్ణను అభినందిస్తున్న సెక్రెటరీ , తదితరులు

ఆర్‌విఆర్ అధ్యాపకురాలికి బెస్ట్ టీచర్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యు కేషన్ (ఐఎస్‌టిఈ) నుండి బెస్ట్ ఉమెన్ ఇంజి నీరింగ్ టీచర్ 2023 - స్టేట్ అవార్డు తమ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ ఏ.శ్రీకృష్ణకు లభించడం గర్వకారణమని ఆర్‌విఆర్ అండ్ జె.సి. ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్ల మూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. ఐఎస్‌టిఈ ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అవార్డుల ఎంపికలలో వచ్చిన అభ్యర్థులను స్క్రీనింగ్ జరిపిన తర్వాత విద్యా బోధనా, వివిధ పరిశోధనలకుగాను గత 30 సంవత్సరాలుగా అధ్యాపక వృత్తిలో ఉన్న ప్రొఫెసర్ శ్రీకృష్ణను బెస్ట్ ఉమెన్ ఇంజినీరింగ్ టీచర్ వార్డుకు ఎంపిక చేసి, గోల్డ్‌మెడల్ అందజేశారన్నారు. సోమవారం శ్రీకృష్ణను కళాశాల సెక్రటరీ అండ్ కరె స్పాండెంట్ రాయపాటి గోపాలకష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు అభినం దించారు.

జిఎంసి గ్రీవెన్స్‌కు 64 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఆయా అర్జీలను వివిధ విభాగాల అధికారులకు అందించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జిఎంసి కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ విభాగాలకు సంబంధించి 64 ఫిర్యాదులు అందాయి.కాగా తొలుత నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో కమిషనర్ ఫోన్ ద్వారా 25 ఫిర్యాదులు అందుకున్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవి, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.

పత్తిరైతులకు నేడు అవగాహన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ఉదయం 10 గంటల నుండి పత్తిరైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి యు. జోగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిధిగా సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) జనరల్ మేనేజర్ హాజరవుతారని, బయ్యర్లు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు. పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం కానున్న నేపధ్యంలో ప్లాస్టిక్ గోతాల్లో పత్తిని తీసుకురాకుండా, గోనె సంచుల్లో మాత్రమే తెచ్చేలా రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

విద్యా వ్యవస్థలను నాశనం చేసిన జగన్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాష్ట్రంలో విద్యావ్యవస్థలను జగన్ నాశనం చేశారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. సత్తెనపల్లి పట్టణంలోని రాఘవేంద్ర బాలకుటీర్ పాఠశాలలో ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదవ్వాలని ఎమ్మెల్యే కోరారు.

పెట్రోల్ చోరీలతో బెంబేలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలో పెట్రోల్ దొంగలతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఇళ్ళ ముదర నిలిపి వున్న బైకుల నుంచి రాత్రివేళల్లో పెట్రోల్ తీస్తున్నారు. మద్యానికి, గంజాయికి బానిసలైన వారు కాజేసిన పెట్రోల్‌ను తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. ఒక్కొక్క బైక్ నుండి సుమారు లీటర్ పెట్రోల్‌ను చోరీ చేస్తుండడంతో వాహనదార్లు లబోదిబో మంటున్నారు. రాత్రి వేళల్లో పోలీసు గస్తీని ముమ్మరం చేయాలని కోరుతున్నారు.



అవినీతి నిర్మూలనకు అందరూ కృషి చేయాలి

ప్రజాశక్తి- మాచర్ల : అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డివిజన్ మేనేజర్ దివాకర్ కోరారు. పట్టణంలోని శ్రీకాసుబ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాళ్లపల్లి పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఇండియా అధ్వర్యంలో సోమవారం విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. అవినీతి వలన జరిగే అనర్ధాలను విద్యార్ధులకు వివరించి, అవినీతి నిర్మూలపై అవగాహన కలిగించారు. సాంస్కృతిక ఐక్యత మరియు జాతీయ సంవృద్ధి అనే అంశంపై విద్యార్థిని విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. పవర్ గ్రిడ్ డివిజన్ మేనేజర్ దివాకర్, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ దేశంలో అవినీతి లేనట్లయితే దేశ సంపద పెరిగి ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే నేటి యువత నిజాయితీ కలిగి ఉండాలన్నారు.

బాణసంచా దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ :బాణసంచా సామగ్రి దుకాణాల్లో రెవెన్యూ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. వెన్నాదేవి సమీపంలో దుకాణాలను సత్తెనపల్లి ఆర్డీఓ జి.రమణా కాంతరెడ్డి, తహశీల్దార్ చక్రవర్తి తనిఖీ చేశారు.



అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దుకాణాలవద్ద ఇసుక బకెట్లు, నీటి డ్రమ్ములు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నా పేరు చెప్పి అధికార దుర్వినియోగమొద్దు

- బాధ్యతగా పనిచేస్తే సమస్యలు తగ్గుతాయి : ఎమ్మెల్యే ప్రవీణ్
- ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి అర్జీలు తీసుకున్న ఎమ్మెల్యేలు



ప్రజాశక్తి - అచ్చంపేట

గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక సమస్యలు రెవెన్యూ విభాగంలో కనిపిస్తున్నాయని, అధికారులు బాధ్యతగా వ్యవహరిస్తే సమస్యలు తగ్గుతాయని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 286 మంది వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలిచ్చారు. అచ్చంపేట వీరభద్ర కాలనీలో మౌలిక వసతులు, గ్రంథసిరి గ్రామంలో సత్యమ్మ తల్లి ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ, చెరుకుపాలెంలో 1993లో నిరుపేదలకు ఇచ్చిన పంట పొలాలను రెవెన్యూ అటవీ శాఖ అధికారులతో సర్వే చేయించి రైతుల సమస్యల పరిష్కరించాలని సిపిఎం నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, జి.రవికుమార్, కెకె రెడ్డి, షేక్ హసన్ ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ 286 సమస్యల్లో 100కు పైగా రెవెన్యూ సమస్యలు ఏళ్ల తరబడి తిరుగుతున్నా పరిష్కారం కానివి ఉన్నాయన్నారు. అధికారులను సైతం సమన్వయం చేసుకుని పనిచేస్తే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని తన పేరు చెప్పి ఎవరైనా ఫోన్ చేస్తే అధికార దుర్వినియోగానికి పాల్పడవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ



మండల కేంద్రమైన శావల్యాపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలు సమస్యలపై ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులకు ప్రజలు అర్జీలు ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వేలో వచ్చిన తప్పులతో ఇబ్బందులు పడుతున్నామని, భూమి విస్తీర్ణాలు తగ్గిపోయాయని పలువురు విన్నవించారు. అనంతరం విలేకర్లతో ఎమ్మెల్యే మాట్లాడుతూ దీపావళి అయిన ఒకటిరెండు రోజులకే మెగా డీఎస్సీ రాబోతోందని, 16,347 పోస్టులతో కూటమి ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీకి నవంబర్‌లో నోటిఫికేషన్ వస్తుందని చెప్పారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

భూ రీసర్వే సమస్యలపై ఈర్లపాడులో సోమవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో 40 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ ఎ.వి.రమణ తెలిపారు. భూముల్లో వ్యత్యాసాలుంటే పరిష్కరిస్తామని చెప్పారు.

ఇసుక సరఫరాను వెంటనే పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులకు సరైన పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు డివిజన్ అధ్యక్షులు బండ్ల మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహశీల్ధార్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం ఆందోళన చేపట్టి డిప్యూటి తహశీల్ధార్ బత్తుల వాణికి వినతిపత్రం అందజేశారు. గతంలో మాచర్లకు రిటన్ వచ్చే లారీలకు వాటి యజమానులు ఇసుక తీసుకొచ్చి అమ్మేవారని గుర్తు చేశారు. ఆ సమయంలో ఇసుక, ఇసుక ధర అందుబాటులో ఉండేదన్నారు. ఇసుక అంశంలో గత ప్రభుత్వం జోక్యంతో ఇసుక ధర విపరీతంగా పెరిగిందన్నారు. ధర పెంపుతో పాటు ఇసుక అందుబాటులో లేకుండా చేశారు. దీని వలన భవన నిర్మాణ రంగంలో నిర్మాణాలు తగ్గి, ఈ రంగం మీద ఆధారపడ్డ అనేక కార్మిక కుటుంబాలు పనుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఇసుక స్థానికంగా ఇసుక అందుబాటులో లేక వేలాది మంది కార్మికులు తెలంగాణకు వలస పోతున్నారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోని ఇసుక అందుబాటులోకి తెచ్చి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాజు, జ్యోతిష్, మణికంఠ పాల్గొన్నారు.

150 మంది పోలీసుల రక్తదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజలకు భద్రత కల్పించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పోలీస్ సిబ్బందికి పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా 150 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎస్పీ మాట్లాడుతూ అమరవీరులు దేశం కోసం, రేపటి తరాలకు మంచి భవిష్యత్తు కోసం ప్రాణత్యాగం చేశారని, ఆ త్యాగాలను వెలకట్టలేమని అన్నారు. ప్రజలను శాంతిభద్రతలను కాపాడే సమయంలో సంఘవిద్రోహ శక్తుల చేతుల్లో బలైన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని, తద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణదానం చేసిన వారవుతారని విజ్ఞప్తి చేశారు. రక్తదానం సామాజిక సేవా కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ ఇటువంటి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్.పి కె.శ్రీనివాసరావు

సామాజిక సేవల్లో పాల్గొనాలని సూచించారు. తలసేమియా, ఎనీమియా, డెంగీ బారిన పడినవారికి రక్తం చాలా అవసరన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్, కొండవీడు హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం దాత ఆరోగ్యానికి మంచిదన్నారు. రక్తదాన శిబిరానికి ఏర్పాట్లు చేసిన ఎఆర్ డీఎస్పీ జి.మహాత్మా గాంధీ, వెల్ఫేర్ ఆర్ఐ ఎల్.గోపినాథ్, ఎఎన్ఎస్ ఆర్ఐ యువరాజ్, ఎంటి ఆర్ఐ కృష్ణ, అడ్మిన్ ఆర్ఐ ఎం.రాజా, రెడ్‌క్రాస్ సిబ్బంది పివిఎం శరత్‌బాబు, వైస్ ఛైర్మన్ బి.మురళీ, మేనేజింగ్ కమిటీ సభ్యులను ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ జె.వి సంతోష్, డాక్టర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వలకు 9300 క్యూసెక్కుల నీటి విడుదల

ప్రజాశక్తి- రెంటచింతల : బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి వివిధ మేజర్లకు 9300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఏఈ శివయ్య సోమవారం తెలిపారు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 3.463 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.2 టీఎంసీల నీరుందన్నారు. కాల్వలకు నీటి విడుదల ఆయా కాల్వల సామర్థ్యాన్ని బట్టి ఉంటుందని చెప్పారు.

ఉచిత సిలిండర్లకు 11,770 మందికి అర్హత

ప్రజాశక్తి - రెంటచింతల : కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలులో భాగంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన వారందరికీ ఉచితంగా ఏడాదికి మూడు సిలిండర్లు ఇవ్వనున్నారు. మండలంలో 17,260 మంది గ్యాస్ తీసుకునే వారు ఉండగా వారిలో 2286 మంది కనెక్షన్లు కలిగిన వారు వివిధ కారణాలవల్ల గ్యాస్ తీసుకోవడం లేదు. 3121 మంది దీపం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. సంక్షేమ హాస్టల్లో, పాఠశాలలు, సబ్ జైల్ అంగనవాడి సెంటర్లకు గ్యాస్ సరఫరా చేస్తుండగా మిగిలిన 11,770 మందికి ఉచిత సిలిండర్లు తీసుకోవడానికి అర్హులుగా ఉన్నారు. మండలం మొత్తం మీద తెల్ల రేషన్ కార్డుదారుల సంఖ్య 16046 మంది ఉన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - యడ్లపాడు : మండల పరిధిలోని వంకాయలపాడు, కారుచోల గ్రామాల మధ్య కోడి పందేలపై ఎస్ఐ వి.బాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం దాడులు చేశారు. అరుగుర్ని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఒక పందెంకోడి, రూ.12,600 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'ఆస్తుల విషయంలో వారికేం సంబంధం?'

ప్రజాశక్తి-చిలకలూరిపేట : అన్నా చెల్లెళ్లయిన వైఎస్ జగన్, షర్మిలకు మధ్య సమస్యలుంటే కుటుంబ సభ్యులు, పెద్దలు కూర్చుని పరిష్కరించుకుంటారని, వీరి మధ్యలో వైసిపి నాయకులైన విజయసాయిరెడ్డి, పేర్ని నానికి ఏం సంబంధమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ ప్రశ్నించారు. ధర్మబద్ధమైన వాటా కోసం షర్మిల పోరాడుతుంటే సాయిరెడ్డి, సుబ్బారెడ్డి రూపంలో అధర్మం, అన్యాయం కేకలేస్తోందని ఎద్దేవ చేశారు.

ఉద్యోగాలకు ఉచితంగా శిక్షణ : అవోపా

ప్రజాశక్తి - మాచర్ల

ఉన్నత ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యం ఉన్న ఆర్యవైశ్య నిరుద్యోగ యువతకు గుంటూరులో ఉచిత శిక్షణను అందిస్తున్నట్లు మాచర్ల ఆవోపా ఎడ్యూకేషన్ ట్రస్ట్ అధ్యక్షులు జెవికెఎస్ ప్రసాద్ వివరించారు. ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ఆవోపా గుంటూరు ఛారిటబుల్ ట్రస్ట్‌కు అనుబంధంగా ఉన్న ఆవోపా ఉన్నత విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు వివరించారు. గుంటూరు నగరానికి చెందిన వారికి ఉచిత కోచింగ్, గుంటూరు వెలుపల నుండి వచ్చే వారికి ఉచిత వసతి, సౌకర్యాలతో పాటు ఉచిత కోచింగ్ అందిస్తారని వివరించారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారికి బ్యాంక్ పిఓలు, క్లర్క్ పోస్టులు, ఎస్ఎస్‌సి, రైల్వేలు ఇతర ఉద్యోగాలకు 5 నెలల పాటు ఉచిత కోచింగ్ ఉంటుందన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి టాలీ, జిఎస్‌టి తదితర 2 నెలల్లో ఉచిత కోచింగ్ ఇస్తారని తెలిపారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారికి ఐటి రంగంలో స్కిల్ పెంపోదించేందుకు గాను వారికి 8 నెలల పాటు సి, సి ప్లస్ ప్లస్, కోర్ జావా, పైతాన్, ఎస్‌క్యూఎల్, డేటా స్ట్రక్చర్ తదితర అంశాల్లో ఉచిత కోచింగ్ ఇస్తారని తెలిపారు. నవంబర్ 11వ తేదిలోపు అప్లికేషన్స్ తీసుకుంటారని, నవంబర్ 20వ తేదిన ఇంటర్వ్యూలు నిర్వహించి, 25వ తేది నుండి క్లాస్‌లు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆర్యవైశ్య నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జెవికెఎస్ ప్రసాద్ సూచించారు. అదనపు వివరాలకు 8019670218, 9491316345కు సంప్రదించాలని సూచించారు.

4న కలెక్టరేట్ వద్ద విఆర్ఎల ధర్నా

విఆర్ఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు : గ్రామ రెవెన్యూ సహా యకుల సమస్యలు పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 4న కలెక్టరేట్ వద్ద జరుగునున్న ధర్నా కార్యక్రమ ంలో వీఆర్ఏలు అధిక సంఖ్య లో పాల్గొనాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక పాత గుంటూరులోని సిఐ టియు జిల్లా కార్యాల యంలో మీడియాతో ఆయన మాట్లా డుతూ విఆర్ఎలను క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సమ స్యలతో పాటు, గ్రామంలో అన్ని రకాల పనులకు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రభుత్వం వినియోగిస్తుందన్నారు. గత 8 ఏళ్లుగా వీఆర్ఏలకు జీతాలు పెంపు లేదన్నారు. వస్తున్నటువంటి డిఏను కూడా గత ప్రభుత్వం కోత విధించారని అన్నారు. నిత్యావసర ధరలు రోజురోజుకు పెరుగుతున్నా వేత నం పెంపు లేదన్నారు. వీఆర్ఏలు గతంలో ఆందోళన చేసిన సందర్భంగా అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న ఇప్పటి చంద్రబాబునాయుడు మన ప్రభుత్వం వస్తుంది..మీకు మేలు జరుగు తుంది. రూ.15వేలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికే అధికారం చేపట్టి నాలుగు నెలలు అవుతున్నా హామీలపై స్పందనే లేదన్నారు. వీటికి తోడు వీఆర్ఏలు విధులు కానటువంటి నైట్ డ్యూటీలు, ఇసుక వద్ద, రైస్ మిల్లుల వద్ద డ్యూటీలు వేస్తున్నారని, వాటికి టిఎ, డిఎ కూడా ఇవ్వట్లేదన్నారు. మహిళా విఆర్ఎలతో సైతం నైట్ డ్యూటీలు చేయించటం వల్ల వారి రక్షణ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. తక్షణమే నైట్ డ్యూటీలు ఎత్తివేయాలి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరి పేస్కేల్ అమలు చేసి విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఖాళీగా ఉన్న వాచ్మెన్, అటెండర్, డ్రైవర్, రికార్డ్ అసిస్టెంట్ వంటి పోస్టులను వీఆర్ఏలతో భర్తీ చేయాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ నామినీలుగా తాతల, తండ్రుల పోస్టులో వచ్చిన వారిని వీఆర్ఏలుగా గుర్తించాలన్నారు. కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో వీఆర్ఏలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర గౌరవ అధ్యక్షులు కె శ్రీనివాసరావు, నాయకులు దేవ బిక్షం తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల్లో విద్యావ్యాప్తికి కృషిచేసిన మృధుబాషిణి చిరస్మరణీయులు

సంస్మరణ సభలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మంద కృష్ణమాదిగ

ప్రజాశక్తి-తెనాలి

అట్టడుగు వర్గాల్లో విద్యావ్యాప్తికి ఎంతగానే కృషి చేసిన మంచి మనిషి పొన్నెకంటి మృధుభాషిణి చిరస్మరణీయులని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరు కరుణా నిలయం విద్యాసంస్థల కరస్పాండెంట్ పొన్నెకంటి మృధుభాషిణి ఈనెల 18న మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆమె సంస్మరణ సభను కరుణా నిలయం విద్యాసంస్థల ఆవరణలో కుటుంబ సభ్యులు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంద కృష్ణ మాదిగ, విశిష్ట అతిథులుగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మాజి మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు డొక్కా మాణిక్య వరప్రసాద్ పాల్గొన్నారు. తొలుత వారంతా మృధుభాషిణి చిత్రపటానికి, సమాధికి కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాత ఉపాధ్యాయులు డి.ఎం.లూధర్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ కరుణా నిలయం విద్యాసంస్థల కరస్పాండెంట్‌గా ఆమె సేవలు వెలకట్టలేనివన్నారు.



మృదుభాషిణి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కృష్ణమాదిగ

లూధర్‌బాబు మాట్లాడుతూ కస్పాండెంట్‌గా విద్యాసంస్థలను మృధుభాషిణి ఉన్నత స్థానంలో నిలిపారన్నారు. అలాగే ఆమె భర్త పొన్నెకంటి నథానియెల్ ప్రేమాచారి సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎంతాగానే శ్రమించారన్నారు. కుటుంబ సభ్యులు పొన్నెకంటి మంజుల, పిబి కరుణాకర్, పొన్నెకంటి ప్రత్యూష్, డాక్టర్ ప్రభావతి, పి.సుధీర్‌కుమార్ మృధుభాషిణి వ్యక్తి త్వాన్ని, విద్యాసంస్థల అభివృద్ధికి చేసిన కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు ఎన్. వెంకటేశ్వరరావు, ఎ.లక్ష్మీసామ్రాజ్యం, జి.వెంకటేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ శోభామంజరి, డాక్టర్ పద్మావతి, మాజీ సర్పంచ్ వల్లూరి వరప్రసాదరావు, వై.రవికిరణ్, ఎ.సుదీప్, సందీప్, బిసి సంక్షేమ సంఘం నాయకులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, పి.హేమలత, డాక్టర్ చైతన్య, డాక్టర్ పి.జోసఫ్ రత్నాకర్, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా రమణ యశస్వీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటె ండెంట్‌గా రమణ యశస్వీ నియమితు లయ్యారు. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంగళవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఆయన ఎముకలు, కీళ్ల విభాగం అధిపతిగా ఉన్నారు.

ప్రొఫెసర్ స్వరూపరాణికి సన్మానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎస్పీ బాలసుబ్ర మణ్యం స్కూల్ ఆఫ్ పర్ఫామెన్స్ అండ్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ విభాగములో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య స్వరూప రాణికి సన్మానం జరిగింది. ఈనెల 26 - 28 తేదీల్లో జరిగిన యువజన ఉత్సవాలలో థియేటర్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్ తరపున పాల్గొని వన్ యాక్ట్ ప్లే, స్కిట్, మైమ్ వంటి మూడు అంశాలలో మంచి ప్రదర్శనలు ఇచ్చి ప్రథమ బహుమతి పొందారు. విభాగాధిపతిగా ఉన్న స్వరూప రాణి విభాగం అభివృద్ధి కి అందిస్తున్న సహకారం పట్ల సిబ్బంది, విద్యార్థి కళాకారులు సన్మానం చేశారు. అనంతరం విద్యార్థులను అభినందించిన స్వరూప రాణి రానున్న కాలంలో మంచి ప్రదర్శన లిచ్చి బహుమతులు సంపా దించి విశ్వవిద్యాలయ ఖ్యాతిని పెంచాలని, ఇందుకు సంబంధించి సహాయ సహకా రాలు ఉంటాయని తెలియ జేశారు. కార్యక్రమంలో ప్రముఖ రంగస్థలం, సిని దర్శ కులు, ఎంఎస్ చౌదరిని ప్రత్యేకంగా అభినందించారు. థియేటర్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్ సంబంధించిన ఆచార్య ఎల్.వి నాగభూషణరావు కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థుల్ని వారి సేవలను నైపుణ్యాల్ని అభినం దించారు.

నేర నియంత్రణలో సిసి కెమెరాల పాత్ర కీలకం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : నేర నియంత్రణలో సిసి కెమెరాల పాత్ర చాలా ముఖ్య మైనదని రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకట్ అన్నారు. సోమ వారం మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామ పరిధిలోని కోకోకోలా కంపెనీ వారి సహకారంతో పెదవడ్లపూడి గ్రామంలో రూ. 25వేల విలువ గల సోలార్ సిస్టంతో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిఘా నేత్రాల ద్వారా గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, దొంగతనాలు, యాక్సిడెంట్లు, జరిగినప్పుడు ఈ నిఘ నేత్రాల ద్వారా గుర్తించి త్వరగా కేసులను ఛేదించవచ్చని ఆయన అన్నారు. గ్రామంలోని వ్యాపారవేత్తలు, గృహాల వారు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే గ్రామ భద్రత పెంచుకుంటామని రూరల్ ఎస్సై సిహెచ్ వెంకట్ అన్నారు.

పోలీసు కుటుంబాలకు ఉచిత వైద్యశిబిరం

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎస్‌పి సతీష్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో పోలీసుల అమరవీరుల స్మారకోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక పోలీస్ కళ్యాణ మండపంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరాన్ని జిల్లా యస్.పి.సతీష్ కుమార్ ప్రారంభించారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ప్రముఖ వైద్య నిపుణులచే ఉచిత చికిత్సలు నిర్వహించారు. రక్త దానం చేయడం ప్రాణ దానంతో సమానం ఎస్‌పి అన్నారు.రక్త దానం విషయంలో అపోహలు వద్దు, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వలన ఇతరులకు ప్రాణదాతలు అవుతారని కోరారు. పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం బాగుంటుందని మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో జనరల్ పిజీషియన్, లివర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ట్రామా-ఆర్థోప్లాస్టిసర్జన్, ల్యాప్రోస్కోపిక్, ఎండోస్కోపిక్, గైనకాలజీ, పల్మనాలజీ, డయాబిటాలజిస్ట్,



చిల్డ్రెన్ స్పెషలిస్ట్, కార్డియాలజీ, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్స్, ఫిజీషియన్, డెంటల్ వంటి విభాగాలలో ప్రముఖ వైద్య నిపుణులచే పరీక్షలు నిర్వహణ మరియు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్, రమేష్ హాస్పటల్, ఒమేగా హాస్పిటల్స్ , గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రులలో ప్రముఖ వైద్యుల వారి ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని మరియు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎఆర్ అడిషనల్ యస్.పి హనుమంతు ,ఎఆర్ డి ఎస్ పి శాంత కుమార్, స్పెషల్ బ్రాంచ్ డి ఎస్ పి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

'శిశిరం' చిత్రం పోస్టర్ ఆవిష్కరించిన ఆలపాటి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక లక్ష్మీపురంలోని పట్టబద్రుల ఎమ్మెల్సీ కార్యాల యంలో సోమవారం 'శిశిరం' చిత్రం పోస్టర్ ను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు. శ్రీ కృష్ణ ఆర్ట్స్ బ్యానర్ పై అమిరినేని వెంకట్ ప్రసాద్, సాదు చలపతి, కన్నె గంటి రవి, అనిల్ మూకిరి సహ నిర్మాతలుగా సీనియర్ జర్నలిస్టు, వరల్డ్ రికార్డు హోల్డర్ కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో శిశిరం నూతన చిత్రం రూపొందుతుంది. పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రత్నాకర్ గతంలో వీరస్థలి తెనాలి అనే దేశభక్తి చిత్రాన్ని తెరకెక్కించి ప్రేక్షకుల మన్ననలను పొందారని, తెనాలి ప్రాంత జాతీయ స్ఫూర్తి, స్వాతంత్ర ఉద్యమంలో తెనాలి వాసుల కీర్తిని చాటారన్నారు. విద్యా వ్యవస్థపై తీస్తున్న మరో చిత్రం శిశిరం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చిత్ర యూనిట్ కు అభినందనలు తెలిపారు. చైల్డ్ సూపర్ స్టార్, కేజీఎఫ్ ఫేమ్ మాస్టర్ భాను, మాస్టర్ పుష్కర్, గోము, యామిని, వెంకట్, మధుకర్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నట్లు దర్శకులు రత్నాకర్ తెలిపారు.

దోమల నివారణ పై ఇంటింటి అవగాహన

ప్రజాశక్తి - తెనాలి : పట్టణం సుల్తానాబాద్ లోని సుందరయ్య కాలనీ, చెంచుపేట ఏరియాలలో స్థానిక మలేరియా సిబ్బంది తో కలిసి జిల్లా సహాయ మలేరియా అధికారి ధరావత్ రాజు నాయక్ ఇంటింటికి సర్వే నిర్వహించి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఎవరికైనా వైద్య సహాయము అవసరమైన వారు సమీపంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గాని, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గాని ఉచిత పరీక్షలు, మందులను పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది బాలచంద్రమౌళి, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, గ్రామీణ సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో వాటర్ ప్లాంట్

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు దివీస్ లాబొరేటరీస్ సహకారంతో మంగళగిరి పట్టణంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి నూతనంగా ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి ప్లాంట్లను ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ స్థానిక టీడీపీ, జనసేన నేతలతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఒక్కొక్కటి రూ 16 లక్షల వ్యయం, 15 వేల లీటర్ల సామర్థ్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన నాలుగు రక్షిత మంచినీటి ప్లాంట్లను ప్రారంభించారు.

చిర్రావూరు నూతన టిడిపి అధ్యక్షునికి సత్కారం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

గత రెండు రోజుల క్రిందట, ఐటి, విద్య శాఖా మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో, టిడిపి చిర్రావూరు గ్రామ నూతన అధ్యక్షుడిగా నియమించిన కాసర గడ్డ శ్రీనివాస్ ను సోమవారం యం టి ఎం సి పరిధిలోని వడ్డేశ్వరం టిడిపి కార్యాలయం లో నాయకులు ఘనం గా సన్మానించారు.టి డి పి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన రావు శాలువా కప్పి,పుష్ప గుచ్చాని అందించారు. ఈ కార్యక్రమం లో టి డి పి గ్రామ అధ్యక్షులు ఈ పూరి బాబు, గ్రామ టిడిపి కార్యదర్శి మద్దినేని సుబ్రమణ్యం,షేక్ ఇమాంసా, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొల్లిపర

రైతులు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వాలని సిపిఎం కొల్లిపర శాఖ మహాసభ తీర్మానం చేసింది. సోమవారం నాయకులు సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ ప్రసంగించారు. ప్రజాసమస్యలపై నవంబరు 8 నుండి 15వ తేదీవరకు నిర్వహించే ప్రజాపోరును జయప్రదం చేయాలని కోరారు. శాఖ మహాసభ జగనన్న కాలనీల్లో కనీస వసతులు కల్పించాలని, ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని తీర్మానించారు.శాఖా కార్యదర్శిగా కోట చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. మహాసభలో సిపిఎం నాయకులు మొలకా శివసాంబిరెడ్డి, ముక్కంటి, బర్నబా తదితరులు పాల్గొన్నారు.

ఎంటిఎంసి లోగో రూపకల్పనకు ఆహ్వానం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ లోగో డిజైన్ ను రూపకల్పన లో యువకులకు మరియు ప్రతిభావంతులను భాగస్వామ్యం చేసేందుకు లోగో డిజైన్ రూపకల్పనకు పోటీలు నిర్వహిస్తునట్టు కమిషనర్ అలిం భాషా సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ ప్రాముఖ్యతను, చరిత్రను తెలియజేసే విధంగా డిజైన్ లోగోను రూపొందించాలని ఆయన సూచించారు. డిజైన్ చేసిన లోగోతో పాటుగా వారి పేరు చిరునామా వివ రాలను commissioner.mtmc@gmail.com కు నవం బర్ 11లోగా పంపాలని తద్వారా లోగో డిజైన్ పంపిన వారిలో మెరుగైన ప్రతిభ కనబరిచిన వారికి రూ.10,000 నగదు బహుమతి ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.

భద్రతా చర్యలు పాటిస్తూ దీపావళి జరుపుకోండి

ప్రజాశక్తి-తాడేపల్లి

తగిన భద్రతా చర్యలు పాటిస్తూ దీపావళి పండుగ ప్రజలందరూ జరుపుకోవాలని తాడేపల్లి సిఐ బత్తుల కళ్యాణ రాజ్ కోరారు. సోమవారం ఆయన తాడేపల్లి స్టేషన్లో మీడియాతో మాట్లాడారు. సుప్రీం కోర్ట్, హైకోర్టు నిబంధనలకు లోబడి దీపావళి సామాగ్రి విక్రయదారులు మసులుకోవాలని కోరారు. నిబంధనలో అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నివాసాలు, రద్దీప్రాంతాల్లో టపాసులు దుకాణాలు ఏర్పాటు చేయరాదని చెప్పారు. బాణసంచా అమ్మే దుకాణదారులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని కోరారు. కాలుష్య రహిత దీపావళిని జరుపుకోవాలని ప్రజలందరికీ దీపావళి శు భాకాంక్షలు తెలియజేశారు.

జిఎంసి సిబ్బందికే ఆశీలు చెల్లించాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థకు సంబం ధించిన మార్కెట్లు, సైకిల్‌స్టాండ్‌లు, మరుగు దొడ్లు, సండ్రీస్ మార్కెట్లలో ఆశీలను నగర పాలక సిబ్బందికి మాత్రమే చెల్లించి, రశీదు పొందాలని, దళారులు వసూళ్లకు వస్తే నేరుగా నగర కమిషనర్‌కి ఫోన్ (9440268888) చేసి ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటా మని కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశీల వసూళ్లకు గతంలో పాటదార్ల గడువు ముగిసినందున జిఎంసి సిబ్బందే వసూళ్లు చేస్తున్నారన్నారు. జిఎంసి ఐడి కార్డ్‌తో, జిఎంసి అధీకత రశీదు అందించే వారికే ఆశీలు ఇవ్వాలని వ్యాపారులకు తెలిపారు. జిఎంసికి సంబందంలేని దళారులు ఆశీలు వసూళ్లు చేస్తున్నారని పలువురి నుండి తమకు ఫిర్యాదులు అందాయని, అటువంటి వారిపై నేరుగా కమిషనర్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కొల్లి శారద హోల్ సెల్ కూరగాయల మార్కెట్, పివికె నాయుడు కూరగాయల మార్కెట్, పాల ఆసుపత్రి వద్ద కూరగాయల మార్కెట్, అరండల్ పేట 1వ లైన్ లోని పచ్చగడ్డి మార్కెట్, సండ్రీస్ మార్కెట్ ల్లో వ్యాపారుల నుండి, పివికె నాయడు మార్కెట్ ఉత్తర, దక్షిణం వైపు ఫెన్సింగ్‌లో, వెన్ లాక్ మార్కెట్‌లో సైకిల్ స్టాండ్‌లు, కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వద్ద, ఎన్టీఆర్ బస్టాండ్, కష్టా పిక్చర్ ప్యాలెస్ సెంటర్, బండ్ల బజార్ వద్ద, గాంధీ పార్క్ వద్ద, విజ్ఞాన మందిరం రోడ్‌లో, తహసీల్దార్ (వెస్ట్) కార్యాలయం వద్ద, పాల ఆసుపత్రి వద్ద, నాజ్ సెంటర్ వద్ద ఉన్న మరుగు దొడ్ల నిర్వ హణ రుసుములను జిఎంసి సిబ్బందే వసూళ్లు చేస్తున్నారని, దళారులకు ఆశీలు చెల్లించవద్దని కమిషనర్ తెలిపారు.



జ్ఞాన దివ్యకు స్వీట్ ప్యాకెట్ ను అందచేస్తున్న వేదా సీడ్స్ డైరెక్టర్ ధర్మచరణ్

పవర్ లిఫ్టర్ జ్ఞానదివ్యకు తులసి ధర్మచరణ్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే తెలుగు క్రీడాకారులు, అథ్లెట్‌లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహాలు అందచేసి వారి ప్రతిభకు తోడుగా నిలవాలని వేదసీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ కోరారు. తెనాలి మండలం కఠేవరం గ్రామానికి చెందిన పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య ఈనెల 4-13 వరకు దక్షిణాఫ్రికాలో జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారతదేశం తరపున నాలుగు కాంస్య పతకాలు సాధించటం పట్ల ధర్మచరణ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జ్ఞానదివ్యను ధర్మచరణ్ అభినందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానదివ్య కుటుంబ సభ్యులు, కోచ్, తదితరులు పాల్గొన్నారు.



చలపతిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - గుంటూరు : లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో అశోక్ లేలాండ్ ఆటో మోటివ్, అపోలో టైర్స్ హెల్త్‌కేర్ సెంటర్ వారు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బిపి, షుగర్, కంటి పరీక్షలు, గ్యాస్ సంబంధిత పరీక్షలు క్యాంప్‌లో నిర్వహించగా, అధ్యాపకులు, సిబ్బంది, డ్రైవర్లు పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆధునిక జీవన విధానంలో ప్రతి ఒక్కరూ వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.